# దొంగలు

రాత్రి పన్రెండు గంటల పది నిముషాలయ్యింది. రైలు వచ్చిన కోలాహల మేమీలేదు. ఆ స్టేషనులో దిగింది ఒక్క బాబూరావే. స్టేషనులో కూలీల మాట అటుంచి దీపాలు కూడా లేవు. ప్లాటుఫారం మీదనుంచి పెట్టె హోల్డాలు రెండంచీలమీద మోసుకువెళ్ళి స్టేషనుకు అనుకొని వున్న చిన్న షెడ్‌లో వేశాడు. ఇటూ అటూ చూశాడు. కారు చీకటి. చలివేస్తోంది. యే బండీ లేదు. ఈ నాలుగు మైళ్ళ దూరం నడిచేలేనా అనుకున్నాడు కానీ సామాను వుంది.

స్టేషను గదిలో దీపం వెలుగుతోంది. రైలు వెళ్ళిపోవటంవల్ల కునుకుతున్న స్టేషనుమాస్టరు దగ్గరకు వెళ్లాడు. టికెట్ యిచ్చి "యెవరైనా కూలీ దొరుకుతాడా?" అన్నాడు. మాస్టరు కళ్ళద్దాలు పెట్టు

గాని తనను గురించి ప్రశ్నలు కురిపించాడు. బాబురావు క్లుప్తం గానే సమాధానాలిచ్చి అసలు ప్రశ్న మళ్లీ వేస్తేనేగాని సమాధానం రాలేదు. "ఎంత మీ నాన్నకు సీరియస్‌గా వున్నా యీరాత్రి మీద వెళ్ళటం యేం మంచిపని కాదు. ఈ రోజుల్లో యిటు వేపు దొంగలు యెక్కువై పోయారు."

"కూలీ వుంటే అంత భయం లేదనుకుంటాను."

"నమ్మినవాళ్లే ద్రోహం చేస్తున్న రోజులివి. రాజూ కూలీ యేకమైతే రాజ్యా లేలేటట్టే వుంది." వ్యాఖ్యానించాడు మాస్టరు.

దొంగ భయాలవలన యీ రాత్రి మీద యే మంచి మనిషి కాదని యెవడూ బండి తీసుకరాడని, తెల్లవారే సరికి యీ చుట్టు పట్ల గ్రామాలనుంచి అద్దెబండ్లు వస్తాయని అప్పుడే క్షేమంగా పోవచ్చని మేస్టారు నొక్కి చెప్పటంవల్ల గత్యంతరం లేక షెడ్ లోనికి వెళ్ళాడు. నాలుగు అగ్గిపుల్లలు వెలిగించి పరుపు పరుచుకున్నాడు. సిగరెట్ ముట్టించాడు. నిద్దరపట్టక తన ఆలోచనలతో నిండిపోయింది. రెండేళ్ళైంది—ఢిల్లీ వుద్యోగ రీత్యా వెళ్ళిపోయాక తన గ్రామం మళ్లీ చూడబోవటం. ఈ లోగా యెన్ని మార్పులు వచ్చాయో?

ఇంతలో స్టేషను మాస్టరు చేతిలో లైటుతో వచ్చాడు. "స్టేషను గదిలోనికి వచ్చి పడుకోండి. ఇక్కడ వుంటే తెల్లవారేసరికి మీరు కూడా మిగలరు."

"ఫరవాలేదండి. ఇంటికి వెళ్లేవరకు నాకు నిద్దర పట్టదు."

"మొన్న మా ఇంట్లో అందరం తెలివేసి వుండగానే దీపాలు

వెలిగించే వేళకే అన్నంకుండ కాజేసేశారు. అలాంటప్పుడు"—బాబురావు కలుగజేసుకొని "ఇంకేమైనా పోలేదుగదా ?"

మాస్టరు సగంపండిన మీసాలు మెలివేసి సహజమైన వుత్కంఠంతో అన్నాడు "ధాన్యపుగాదిలే యెగిరిపోతున్నయ్ పొలాల్లో చేనే మాయమైపోతోంది. యువకుడివి, బాగా ఆలోచించు. దేశం యిలా దొంగల ముఠాలపాలైతే యేం బాగుపడుతుందో?"

బాబూరావు మాటాడకండా పరుపు చుట్టాడు. స్టేషను గదిలో ప్రక్క వేశాక "రెండేళ్ళకిత్రం యిలాంటి దొంగతనా లేవీ వుండేవి కావు. మీ మాటలనుబట్టి పరిస్థితులు చాలా మారిపోయాయన్న మాట!"

"బాగానూ!!" మాస్టరు చుట్ట వెలిగించి కిటికీతలుపు మూస్తూనే అన్నాడు.

పరుపుమీద వ్రాలి రగ్గు కప్పుకుంటూనే "పెళ్ళయిందా" అన్నాడు. లేదన్న బాబూరావు సమాధానం విని స్వీయచరిత్ర ప్రారంభించాడు.

"ఈయేడు చిన్నకూతురి పెళ్ళి ఘనంగా చేశాను"

"అల్లుడుగారేం చేస్తున్నారు?"

"రెవెన్యూ యిన్‌స్పెక్టరు"

"కట్నమెంత యిచ్చారు?"

"మూడు వేలుగానీ—ఖర్చులు చాలావరకు అయ్యాయ్"

బాబురావింకే ప్రశ్నా వెయ్యలేదు. గదిలో వెచ్చగా వుండటం వల్ల ఆయన చెప్తున్న మాటలకు వూఁకొట్తూనే నిద్రపోయాడు.

మాస్టరు వేకువఝామునేలేచి "మీ వూరుబండీ ఒకటే వచ్చింది రూపాయికంటే హెచ్చు యివ్వకండి" అన్నాడు.

బాబూరావును చూడగానే బండివాడు "దండం బాబూ" అన్నాడు. తండ్రి ఒంట్లో కొంచెం నలుగా వుందని విన్నాక తొందరపాటు తగ్గింది. మాస్టరువద్ద శలవు తీసుకొని, ఆ, బాగా ధూళి అంటుకున్న బట్టలు చెదిరిపోయిన జుత్తు పాలిపోయిన తోనే బండి యెక్కాడు.

పొలాల్లో పెసర చేనువుంది. యెద్దుల బండి గంటల చప్పుడుతో పొలాలతో పరుంచే పోతోంది. ఒక దగ్గర బండి ఆపించాడు. మిరపచేనుకు యేతాం సహాయమున నీరు పోస్తున్నారు. పలు తోపుకొని చేత కొన్ని పెసరకాయలు పట్టుకొని పరగడుపునే తినటం మొదలు పెట్టాడు. లింగాలపాడు దాటాడు. తన గ్రామం బుచ్చిపేట కనిపిస్తోంది. బండి వాడిని లోనికి పంపించి కొండాపట్టుకొని మొఖరమీద కూర్చొని యెద్దులను వడిగా అదురుతున్నాడు. అప్పన్నా యేదీ పాట అన్నాడు. పాడమంటేను—మళ్ళీ గసిరాడు. వాడు గొంతుక సవరించుకొని సమయానికే యెదరగా వస్తున్న మనిషిని కొద్దిగా గుర్తుపట్టినా వాడవునో కాదనో సంశయిస్తుంటే అప్పన్న అన్నాడు, "అడుగో బాబూ—మీ పిన్న తాత—బుద్ధు లేమీ బాగలేవు."

"ఏం ఏం?"

"దొంగ బాబూ; దేనికైనా మీ తాత ముకం మీ మామ్మ ముకం సూసి పూరోలు యిడిచిపెట్టేసినారు"

సీతయ్య యెదురుగా వచ్చి బండి ఆపి "నా నాయనా వచ్చావురా? కళ్ళుకాయలుకాసి పోయినట్లుచూస్తున్నాం. పెద్ద వైద్యగుడ్ని పట్నం నుంచి తెప్పించారు. ఇప్పుడు మీ నాన్న తేరాడలే!"

ఎదురుగా పొడుగు మనిషి—మూతి నిండుగా మీసాలు—లోతు కళ్ళు. గెడ్డం బాగా మాసేవుంది. జుత్తు డిప్ప కత్తిరింపు, శరీరచ్ఛాయ నలుపేగానీ కారునలుపు కాదు. మీసాలు అక్కడక్కడ పండు వెంట్రుకలతో వున్నాయ్. మాసిపోయిన పంచె కట్టున్నాడు. మీద చింకి గుడ్డ కప్పుకొని కొంచం చలికి వణుకుతున్నాడు.

"ఇంత ప్రొద్దున్న యెక్కడికిరా తాతా?" అన్నాడు బాబురావు.

మీ అవ్వ ఒంట్లో బాగాలేదు. లింగాలపాడు వైదుగుకు మందిస్తున్నాడు" ప్రక్కకు తప్పుకొని "వెళ్ళు నాయనా! మరి వుంటావుకదా?" బండి మెల్లగా వెళ్తోంది. బాబురావు వెనకకు తిరిగి చూచి "తాత బాగా యెండిపోయాడే" అనుకొని అప్పన్నతో అన్నాడు. "మా చిన్నతాతని దొంగని చేసేస్తున్నా వేమోయ్. వాడికి దొంగతనం చేసే ఖర్మమే మొచ్చింది?"

"ఏమీ లేకపోతే పూరోలు పూరకనే అంటారా బాబూ? పొలాల్లో రాతిరిమీది సేనిమోసినప్పుడు సెట్టుకి కట్టేసి వాతలేసి పోదురు. మరి మీ తాత ముకంసూస...."

అప్పుడే పొలాలు దాటి బండి మామిడి తోటలోనికి పోయింది

అప్పన్న మొఖరమీదకు వచ్చాడు. బాబురావు బండ దిగి వెనుక మెల్లగా తలవంచుకొని నడుస్తున్నాడు. తాటి చెట్ల పెండె దగ్గర నిల్చున్నాడు. అక్కడకు తను లెక్క లేనన్ని సార్లు చిన్న తాతయ్యతో వచ్చాడు. పదేళ్ల క్రితం జరిగిన సంఘటనలవి. వేసవి శెలవుల్లో తను వచ్చే సరికి చిన్న తాత తనకోసం యెన్నో కబుర్లు వస్తువులు దాచిపెట్టేవాడు. భుజంమీద యెక్కించుకొని హనుమంతునిలా గెంతులేసుకొని తోటకు తీసుకుపోయేవాడు. పచ్చి పిక్కలు తీసి చేతికి తీపి అంటుకున్నా వలిచి చేతపెట్టి పలుకులను తినిపించేవాడు. పదునైన కత్తి పట్టుకొని యీ తాటి పెండెకే తీసుకువచ్చి గెలకు గెలా తెగనరికి బొమ్మక్కాయలా కోసి తాటి ముంజలను తినిపించేవాడు. మొదటిసారి "ఒరే తాతా! తోటమనిషి వస్తే తాత"-మనుమని భయానికి నవ్వి "దొంగ ననుకున్నావురా నాయనా! అడిగే వచ్చాను మా మనమడు వస్తే యివిగో యీనాలుగు బిళ్లకాయలున్న తాటి చెట్లూ వాడివి అని ముందే చెప్పాను. నన్ను కాదన్నవాడు యీ వూర్లో లేడనుకో."

అప్పన్న కేక వేశాడు. బాబూరావు ముందుకు సాగాడు. గుడ్డిమీద చెఱుకు పంట — ఆ పక్కనుంచే నది గట్టువెంబడిబండి పోతోంది. చలికాలం ప్రవేశించగానే యేటి ఒడ్డున కొయ్యలుపాతి నీటిలో నక్కతులసి, వెంపలి కంపలతో పెచ్చులు వేసేశాడు. చిన్న వల పట్టుకొని వేకువఝామున, సాయంత్రం ఆ పెచ్చులు యెత్తి చేపలు తెచ్చేవాడు. మంచివన్నీ మనుమడికే. మారుపుపడిందంటే తను దగ్గర కూర్చోవాలి. మనుమడు నవ్వుతూతృప్తిగా తినాలి. ఒకసారి తగువు తీసుకవచ్చాడు తన పెచ్చులు దొంగతనంగాయెత్తి

చేపలు అపహరించాడని ఒక కుర్రాడ్ని చావమోదాడు. ఆ కుర్రాడి తల్లిదండ్రులు యేడుస్తూ ఆ సమిష్టి కుటుంబపు యింటిపెద్దవద్దకు వస్తే ఆయన తమ్ముని చివాట్లు పెట్టాడు. అరుగుమీద కూర్చున్న బాబురావిదంతా చూస్తున్నాడు. చిన్నతాత చివరకు విజృంభించాడు. 'దొంగబతుకూ ఒక బతుకే—కడుపు కక్కుర్తి తీరకపోతే చచ్చిపోవాలి గానీ—దొంగతనం చెయ్యటమా?"

"నయాన్నో భయాన్నో బుద్ధి చెప్పాలి గానీ అలా చావ మోదుతావటరా?" బాబురావు తల్లితండ్రియైన యింటిపెద్ద విరుచుక పడ్డాడు. దానితో చలించి చనుమడి దగ్గరకు వచ్చేస్తూ "నడు నాయనా." అంతదూరం తీసుకపోయి "తలైనా తోబుట్టువైనా నాయం దగ్గర వొకటేనరా! నా కొడుకు దొంగతనం చేసినా వదిలేస్తానా? యెముకలు యిరిచేనూ?"

ఊరు దగ్గిం పడింది. గోర్జ (పుంత) నుండివీధి వేపు బండి పోతోంది. బాబూరావు అగపడ్డ వాళ్ళ పలకరింపులకు సమాధానాలిస్తూనే యింటికి చేరుకున్నాడు.

రాత్రంతా నిద్రలేక పోవటంవల్ల ప్రయాణ బడలికలవలన నిద్రనుంచి లేచేసరికి సాయంత్రం నాలుగు గంటలైంది. సీతయ్య నడవ అరుగుమీద స్తంభంచాటున కూర్చున్నాడు. కిటికీనుంచి చూచి "రారా తాతా లోపలికి" అన్నాడు. సీతయ్య జంకుతూనే వచ్చి గొణగడం ప్రారంభించాడు. "నా నాయనా వచ్చావురా! నా సంతోషం అలా వుంచు. మీ అవ్వకి జ్వరం పోయిందనుకో నేనన్నాను అన్నం, పెట్టేవాళ్ళకి అడగాలటే—సలికాలంకదా యీ సింకి గుడ్డపాత సూసి మనమడు పూరుకుంటాడటే."

బాబూరావు నిశ్చేష్టుడయ్యాడు. ఇలాంటి మాట ఇదివరకు వినలేదు. తను గడిస్తున్న యీ నాలుగేళ్ళలోనూ రెండేసార్లు రెండు రూపాయలిచ్చాడు. ఇచ్చేవరకూ యెప్పుడూ అడగలేదు యిలా నిరాశా వాక్యాలు యెప్పుడు వెళ్ళగ్రక్కలేదు. అంతలో చప్పున "వస్తాను నాయనా" అంటూ గొణుక్కునే గదినుంచి వెళిపోయాడు.

బాబూరావు ముఖంలో సంతోషం తాండవ మాడింది. గది లోనికి కాఫీగ్లాసుతో వచ్చిన తల్లి "యేం అడుగుతున్నాడు" అంది. కొంత సేపటికిగానీ "యేమీ లేదని" చెప్పలేకపోయాడు.

కాఫీ త్రాగాక గదిబయటకు వచ్చాడు. ఇంటిచుట్టూ తిరిగాడు. సీతయ్య కనిపించలేదు. బట్టలు మార్చి తాతగారింటివేపు వెళ్ళాడు.

తాత కోర్టుపక్షి. గొంతుక యెత్తాడంటే చిన్నపిల్లలు జడుస్తారు. ఆ చుట్టుపట్ల వూర్లలో యే తగువులైనా పరిష్కారానికి తన వద్దకు రావలసిందే. రెండువేపులా కాసి డబ్బు చేసుకోవటం పరిపాటి. ఇంటికి పెద్ద అయినందుకు గడించా డేంతో. యింటి పేరు కూడా అలానే నిలబెట్టాడు. తమ్ముళ్లు ముగ్గురు. పెద్దవాడికి ఒక కూతురు, రెండోవాడికి పిల్లలు లేరు. చిన్నవాడైన సీతయ్యకు నలుగురు ఆడపిల్లలు, యిద్దరు మొగపిల్లలు. పెద్దవాడు పదహారేళ్ళవాడు. చదువు సంధ్యాలేదు. ఇంట్లో వ్యవసాయపుపనీ చేతకాదు. ఊర్లో కుర్రాళ్ళకి పెద్ద. కుర్రాడు చూపుకి దద్దమ్మ, తెలివికి మొద్దు.

ఇక యింటి పెద్దకు ఒక కొడుకు ఒక కూతురు. కొడుకు మైనరు తరపున గ్రామం మునసబు పనిచేస్తున్నాడు. కూతురును వూర్లోనే యిచ్చారు. స్కూలుమాస్టరు భార్య, బాబురావు తల్లి.

అమ్మమ్మ, తాత మనుమడ్ని కుశల ప్రశ్నలు అడగటం మొదలు పెట్టారు. బాబురావు యీ సంవత్సరం యేమాత్రం పండిందన్నాడు, నౌకర్లు కొట్టులో ధాన్యం పొయ్యటం చూసి తాత అన్నాడు. "నాలుగు గరిసెల వరకూ వుంటాయి. అయినా దానికి మదుపులు తక్కువయ్యా యంటావా ? ఇదివరలో రేయివుడుపుకి అణా అంటే ఇచ్చేవారు యిప్పుడు అర్ధరూపాయి ముందు యిస్తే గానీరారు. ఐదువందలకు పైగా మదుపులే అయ్యాయి యింకేం తింటాం ?"

ఈ మాటలు వింటుండగానే మనసులో తిరిగిన ప్రశ్న వెయ్యకుండా వుండలేక పోయాడు. "విడిపోయారుకదా వాళ్ళకే మిచ్చారు ?"

"ఇచ్చామురా ! ఆ వెధవలు కృతఘ్నులు. పెద్దలు వదిలిన ఆస్థిపాస్తు లెంతో తెలుసునుగ ! మరి వాళ్ళ పెళ్ళిళ్ళకీ, వాటికీ వీటికీ తక్కువ తగలేశావా? ఎన్ని అప్పులయ్యాయో నీకేం తెలుసు? ఐనా నాకు అన్యాయం యెందుకు? నలుగురు పెద్ద మనుష్యులు భేష్ అన్నట్లే యిచ్చాను. ఏం యిచ్చినా యేముంది? మా యింటా వంటా లేనిపని ఆ సీతిగాడు చేస్తున్నాడు. తలెత్తుక తిరగలేక పోతున్నాం."

బాబూరావు విషయం తరచి ప్రయోజనం లేదని వూరుకున్నాడు. ఆయన నోటిలో నోరు పెట్టేశక్తి ఆ చుట్టుపట్ల గ్రామాలలో యెవరికీ లేనప్పుడు తన కెక్కడుంటుంది?

ముసలాడు అన్నాడు "నివ్వు రెండేళ్ల కితం యిచ్చావే— ఆ కమీజు మొన్ననే చిరిగిపోయిందిరా. కుట్టిద్దామన్నా అలాంటి

చట్టమైన బట్టలు యిటు వేపు లేవు"

బాబురావు "మళ్ళీ వస్తానుతాతా" అంటూ లేచిపోయాడు.

"తమీజు అడుగుతున్నానని గాని లేచిపోతున్నావురా?"

"అబ్బే! ఇంకొకటి తీసుకవచ్చానులే తాతా!" అన్నాడు.

వీధిలో పడేసరికి చింతచెట్టు చాటున నిల్చున్న సీతయ్య దగ్గరకు వచ్చాడు. "అంత భయమెందుకురా తాతా" అంటే" నీకు తెలీదు నాయినా! ఎవరైనా చూస్తే నిన్ను కష్టపెట్టున్నానని అన్నతో చెప్తే కేకలు వేస్తాడు. తిట్తాడు?"

"విడిపోయారుగా — ఇంకా తిడ్తాడా?"

"పెద్దాడు. తిడితే పూరుకుంటాను గానీ తిరగబడ్తానా?"

కొన్ని సంవత్సరాలు గొడ్డులా కష్టపడి యెద్దులా తినే మనిషి యెందరి యెదురుగానైనా నాకేం అన్నట్లు మెసలి మీసాలు మెలి వేసిన మనిషి. యీ నాడు నక్కి నక్కి మెసలినా అర్థాకలితో వున్నా, యెండిపోయినా యిద్దర్ని కొట్టే బలం లేకపోలేదు. బాబూ రావు యీ తాతవేపు చూసి తృప్తితో నవ్వాడు.

నాలుగడుగులు వేశాక గొణిగాడు. "రాతిరి మీ అవ్వ పూష్ణం తోనే అంబలి వండించిరా! ఈ వేళ నిప్పు వచ్చావు. మీ మనమడు వచ్చాడు — యీ రాతిరికే యిచ్చేస్తానురా అని కోమటి నాగేశం దగ్గర రూపాయి బియ్యం అరువు తెచ్చాను. నీయిష్టం నాయినా!"

బాబురావు వెనుకకు తిరిగేసరికి మనిషి అప్పుడే యెక్కడో నక్కి పోయాడు. ముందుకు చూసేసరికి తాలూకాఫీసుకు వెళ్ళిన

మునసబు తిరిగివస్తున్నాడు. అంతదూరం నుంచే "యేమోయ్ అల్లుడా? ఢిల్లీ భోగట్టాలేమీ చెప్పావు కాదు—యింటికి నడు"

"మళ్ళీ వస్తాను మావా" అన్నా బలవంతం చేసి యింటికి తీసుకుపోయాడు. ఈ కబురూ ఆ కబురూ చెప్పుకొనేసరికి సాయంత్రమైంది. రెండో వీధిలో వున్న తన యింటివరకూ సాగనంపాడు. కోమటి తాత చూస్తానంటున్నాడురా అలా ఒకసారి వెళ్ళమని అమ్మ చెప్పటంవల్ల వెళ్ళాడు. ఇదివరకున్న గడ్డి యిల్లు యిప్పుడు పెంకుటిల్లుగా మారింది. వీధి వరండాలో కిరాణాకొట్టు వుంది. కోమటి తాత విధవ చెల్లెలు దుకాణంమీద వుంది. చిన్న బల్లమీద కూర్చోబెట్టి కోమటితాత అన్నాడు "సిగరెట్లు లేవు — బీడీ తేనా?"

"ఏదీ వద్దులే తాతా" అన్నాడు.

"నీకేం మహాపట్నంలో వున్నావ్—అక్కడ ధరవరలెలా వున్నయ్ తాతా."

"ఏదో వున్నాయ్" అన్నాడు హోటల్లో తింటున్న తనకేమీ తెలియదని చెప్పేబదులు.

"ఏంటో కాలమాన మేమీ బాగులేదు, దొంగతనాలకి అడ్డూ ఆపూ లేదు. మరి కరువు సంగతా చెప్పలేం—చిన్న పిల్లాడి దగ్గర నుంచి నా వరకూ కష్టపడినా చాలాకండా వుంది. ఈ కాలంలో వుద్యోగం చేసుకున్నంత మంచిపని యింకేమీ లేదు. ఆలేమీ సంసారానికి నీ చెయ్యి వేగం కలిసొచ్చినందుకు మీ బాబు అదృష్టవంతుడు"

హరికెన్ లాంతరు వెలిగించారు. ఆ వెలుగులో బొగ్గు నలుపు, పొట్టి దుబ్బ మనిషి వేపు యెగాదిగా చూశాడు. పెద్ద బొజ్జకు చుట్టిన గవంచా జారిపోతోంటే సర్దుకుంటూనే "చిన్నప్పుడు మా

యింట్లో బెల్లం అంతా నువ్వే తిన్నావు తాతా! ఆ పట్నం నుంచి యేం తెచ్చావో యేంటో?"

బాబురావు నసిగేశాడు. ఇంట్లో తోటికోడండ్రుడు నోరు చేసు కోవటంవల్ల తాత లోపలకు అరచుకుంటూ వెళ్ళాడు. బాబురావు ఆ స్తంభందాటున కూర్చొనే కొనటానికివచ్చిన మనుషులవేపు చూస్తు న్నాడు.

మాసిపోయిన చింకిబట్టలు, ముక్కుడొంకల్లాంటి జుత్తులు. పేదరికం కళావిహీనం చేసిన ఆశలేని ముఖాలు. బ్రతుకుభారం మోయలేని మానవులు! అర్ధనగ్నంగా, అర్ధాకలితో వున్నా అమానుషంగా ప్రవర్తించలేని అమాయక వ్యవసాయపు కూలి జనం—చేతుల్లోవున్న చేటల్లో, బుట్టల్లో, చీరకొంగుల్లో—చెమట కార్చి గడించిన ధాన్యపుగింజలు మహాప్రీతితో ఒకరి తరువాత ఒకరు పేస్తున్నారు దుకాణదారిణి పెద్దసోలతో ధాన్యం కొలుస్తోంది. చిన్నసోలతో వుప్పు యిస్తోంది. ఒక మహాత్ముడు యిటువంటి పేద జనానికి చౌకగా వుప్పులభ్యంకావాలని సత్యాగ్రహం చేశాడు!

ఒకరితరువాత ఒకరు వెళిపోతున్నారు. కొసరవేసి నందుకు సంతోషాన్ని వెలిబుచ్చినవాళ్ళుకూడా లేకపోలేదు.

ఒక మూలనుంచి తలమీద బట్ట కప్పుకొని "నారాయణమ్మా! యింట్లో దీపంలేదు. వేగంగా కిరసనాయిలుయిచ్చే" అంటూ సీతయ్య ప్రవేశించాడు. "ఇస్తాను, బయటేవుండు బయటేవుండు" అని కసిరిం దావిడ. లేచి ముందుకువెళ్ళి ధాన్యం అందుకొని చప్పున కొలిచి సీసాలో కిరసనాయలు పోసింది. కసిరాడు సీతయ్య. "నీ తల్లీ దండ్రికి దండం పెట్తాను, వెళిపోతండ్రీ" అంటూ కొంచెం

పోసింది. సీతయ్య వెళిపోతూ "నివ్వు కొసర వేస్తావమ్మా— చెప్పా కోవాలి" అని గొణుక్కోవటం విన్న మనుషుడు సగానికి సగం దోపిడీ చేసిన నారాయణమ్మ యెదురుగా వుండలేక పోయాడు.

మరుచటి రోజు తండ్రిదగ్గర కూర్చొని మాటల్లోమాటగా "సీతయ్య తాతని దొంగంటున్నారే" అన్నాడు బాబురావు.

"నిజమే" అన్న క్లుప్తమైన సమాధానం తప్పించి యింకే విషయం బయటపడలేదు. బహుశః నీరసంవల్ల మాటాడలేక పోతున్నారేమోనని తరచి అడుగలేదు. ఇంతలో యిద్దరు రైతులు రావటంవల్లకూడా అప్పటికి యీ విషయం ఆపుచెయ్యవలసి వచ్చింది.

అవేళ సాయంత్రమే యేటిఒడ్డున చిన్నతాతను కలుసుకున్నాడు. కాల్చిన పెసరకాయలు చేతనిస్తూ "యివి ఒంటి కెంతబలమంటావ్-వున్నన్నాళ్ళూ రోజూ తెస్తానులే" అన్నాడు. నిన్ను అందరూ దొంగ అంటున్నారే, యెంతవరకు నిజం, అన్న ప్రశ్న బయటకు అనే సాహసం లేకపోయింది. ఇద్దరూ నడుస్తూ నీలాటి రేవు దాటిపోయారు.

సీతయ్యతాతకు యీ రోజుల్లో యే మాటకూగొణుక్కోవటమే అలవాటైనట్లుంది. "తినిలేదంటే మహాపాపంనాయనా! ఆనాడూ రెండుసార్లు రెండు రూపాయలిచ్చావు. నీతల్లికడుపు సల్లగుండాల రాతిర రూపాయి యివ్వబట్టి మాట నిల్చింది. ఈ వేళ అన్నమాట నిలబెట్టకపోతే రేపెవరైనా నమ్ముతారా?"

ఊరంతా దొంగన్న మనిషి యీ వాక్యాలు అంటుంటే బాబురావు మరేం మాటాడలేకపోయాడు. చిన్నప్పటినుంచీ తనకూ

యీ తాతకూ వున్న బంధం అలాంటిది. సమిష్టి కుటుంబంలో పశువులకీ పాలాలకీ పెద్దతను—తను చెమట కార్చాలి భూమి పండాలి—తను ఆవులను మేపాలి—అన్న రాత్రి శేరుపాలు తాగాలి. పేదారోదకి చేనుమోపులిచ్చి "అన్నా? యిది వాళ్ళకిచ్చేసురా" అని చెప్పి నాలుగు చీవాట్లు తిన్నరోజులు కూడా లేక పోలేదు.

ఒకసారి మనుమడితో చెప్పుకున్నాడు "చూడరా నాయనా! మీ అవ్వ యెంత పాపం చెయ్యమంటోందో? నాపీక తెగాలి గానీ వాళ్ళకళ్ళు కప్పి ధాన్యం అమ్మి డబ్బు చేసుకుంటావా? పిల్లలున్నారు. ఉన్న పాటున వాళ్ళు యిలా యింటినుంచి తగిలేస్తే మనగతేం కానంటుంది. మా అన్నలాంటి పెద్దమనిషిమీద అంటావే అని ఒక్కటిశాను. ఛా ఛా! పాపం చేస్తే అదిపామై యేనాడో కరవదా? ధర్మం గొడుగై కాస్తుందని పెద్దలంటారు నాయనా!"

అప్పుడే ప్రొద్దుక్రుంగుతోంది. ఏటి ఒడ్డున యిసుకతిన్నె మీద యిద్దరూ కూర్చున్నారు. బాబురావు పెసరకాయలు గికుతూ తొక్కలు నీళ్లలో విసురుతున్నాడు. కొంచం చలి వేస్తోంది. ఈ ఆలోచనలు తలలో తిరుగుతున్నప్పుడే తాత మళ్ళీ గొణగడం ప్రారంభించాడు.

"కాలమానం యెలాగుందో పట్నంలో వున్నావ్ నీకు తెలీదు నాయనా! ఈ యేడు రూపాయలకి శేరుబియ్యం అమ్మారు పిల్లలుకూడిపోయారు. మీ అవ్వ నెత్తి బాదుకొని యేడుస్తుంది. నామాట విన్నావు కాదంటుంది. నేను చేతకానివాడి నంటుంది.

ఏమన్నా పడాలి మరి —దాని ఒళ్ళు కప్ప లేకపోయాను. అదలా వుంచు—పిల్లలు గిజగిజ గింజుకొని గిన్నె పట్టుకొని మీ అమ్మ దగ్గర కెళ్తే —యిచ్చింది చెప్పుకోవాలి—ఇంత అన్నం గెంజీపోసేది. సముద్రమైనా నిండుతుందిగానీ కడుపునిండుతుందా? తెల్లారే సరికి పరగడుపే!!"

ఈమాటలతో బాబురావు "చలివేస్తోందిరా తాతా" అంటూ లేచిపోయాడు.

ఆరాత్రి భోజనం దగ్గర అమ్మ తినమని బలవంతంచేస్తోంది. సరియైనతిండీ, సమపాయంలేక యిలాయైపోయినందుకు చింత వెలబోస్తోంది. ఇంకా యెదురుగా వున్న అన్నంలో నలభైయై దేళ్ల చిన్న తాత దైన్యంగా కనిపిస్తున్నాడు. అమ్మ అన్నమాట లకు తలెత్తకుండానే "పాపం! సీతయ్య తాత యెలా యెండి పోయాడో?" అన్నాడు.

కన్న తండ్రిని సమర్థిస్తూ పినతండ్రి మీద యింత చెప్పింది తల్లి. ఇంట్లో అందరినీ గాదె కడుపులకే పిన తల్లి నాలుగురోజులు చెయ్య వలసింది. ఒక పూటలో లేదనిపిస్తుందని యింకా ఆమె చేస్తున్న దానాన్ని కూడా చెప్పుకుంది.

బాబురావు లేచిపోతూ "మూడుపూటలు అంబలిజుర్రితే కడు పులు గుళ్ళదేరవా అమ్మా! మామ్మేవుంటే యిలా జరగనిచ్చేదా? అన్నాడు.

తల్లి యింకేదో అంటున్నా వినిపించుకోకండా అంగటి గది లోనికి వెళ్ళి కుర్రపెట్టి మీదకూర్చొని యెదరగా మంచంమీద నీర సంగా పడున్న తండ్రితో మాటలు కలిపాడు.

"సీతయ్యతాతని వూరంతా దొంగంటున్నారే!" అన్నాడు. మళ్ళీ.

"నిజం!"

గోడకున్న దీపం మసగ్గా వెలుగుతోంది.

"విడిపోయారు కదా యే మాత్రం పొలంయిచ్చారు?"

కొంతసేపటికి గానీ సమాధానంరాలేదు, ఆగి ఆగి చెప్పు కొచ్చాడు "ముసలమ్మ చావుకు సిద్ధంగా వుందనగా మీతాత వీలు పుట్టించాడు. స్మారకం లేనప్పుడు మంచిరాత్రిమీద మామ్మ బొటన వేలి ముద్దర వీలుమీద వేసుకున్నారు. పెద్దలు గడించిన యెకరా యిరవై సెంట్లే నలుగురికీ చెల్లుతుంది. సమిష్టిగావున్నప్పుడు గడిం చిన ఆరుయెకరాలపొలం అప్పులతో సహా పెద్దవాడు గడించాడు కాబట్టి వాడికే చెల్లుతుంది"

"ఇదెక్కడి న్యాయం?"

"వాళ్ళకదే న్యాయం! మామ్మకాలంచేసిన సంవత్సరానికే పేర్లుపెట్టి మిగతా ముగ్గురికీ చెరో ముప్ఫయిసెంట్లు యిచ్చాడు"

"ఊరంతా యేం చేస్తున్నారు?

"మీతాత నాకళ్లకప్పబోతే వూరి కళ్ళు కప్పలేడా? వీలు మీద సాక్షి సంతకం పెట్టమంటే కాదన్నానని నాతో యీ నాటికీ మాటాడ తాడనా? ఎవరో ఒకరు అడిగితే ఫలానప్పుడు యింత అప్పు తెచ్చాను అంత అప్పు తెచ్చానని దొంగపత్రాలు నాలుగు వేలు వరకూ చూపిం చాడు,"

"నమ్మారా?"

"నమ్మకమేం చేస్తారురా నోరున్నోళ్ళదే పూర్తైతే! నీకూ నాకూ అబద్ధం కానీ కోర్టులో నిలిచేపత్రాలు కనిపిస్తున్నాయ్‌గా. అందులో నాలుగూళ్ళలో పెద్దమనిషని పేరుపొందాడుగా! నేనూ నలుగురితో యీ అన్యాయం చెప్పాను. అన్యాయమని ఒప్పుకొనే వాళ్ళేగానీ అడిగి సాధించేవాళ్ళెవరూ లేరు!"

బాబురావు పెట్టెమీద కూర్చోలేక పోతున్నాడు. పెదాలు కొరుక్కుంటున్న కొడుకువేపు చూసి మళ్ళీ మెల్లగా అన్నాడు:

"నిరుడు బాగా పండిందెంతో కరువంత హెచ్చింది. మీ సీతయ్యతాత అన్నదగ్గరే భూమిమీద మూడువందలు తెచ్చాడు. అన్న దగ్గరే యీపాయికి శేరుబియ్యం కొన్నాడు. ఈయేడు పంట వడ్డీగా కట్టి అప్పుడే అడుక్కు తింటున్నాడు. తప్పు లేదులే."

బాబురావు యీ చివర వాక్యానికి సంశయంగా చూశాడు

చెప్పాను "అప్పుతీసుకరాకు. అమ్మివేస్తే ఆరు వంద లొస్తుంది. ఆ డబ్బు పెట్టి యేదో వర్తకం చేసుకుంటే యిటుకడుపుకి గడుస్తుంది. వాడి అదృష్టం బాగుంటే నాలుగుపైసాలు గడించుకుంటాడని. నామాట విన్నాడు కాదు. కూలికా వెళ్ళలేడు నాకేమని రెండేళ్ళ కితం వరకూ బ్రతికాడుగా. ఇప్పుడివ్వుడూ వెళుతున్నా అందరికీ భయమే!"

కష్టసమయంలో వంద సలహాలు చెప్పేవాళ్ళుంటారు గానీ కొంత బాధ పంచుకొనే వాళ్ళరుదు. ఈ ఆలోచనలతో బాబూరావు అక్కడ వుండలేక వెళిపోయాడు.

మళ్ళీ చీకటిరాత్రులు వచ్చాయి. నెలరోజుల శెలవు పూర్తికా

వస్తోంది. ఎల్లుండి ప్రయాణమనగా యీ వేళ చీకటిపడ్డ సమయానికి తాతగారింటికి వెళ్ళాడు. తాత వాకిట్లో నిల్చొని కేకలు వేస్తున్నాడు. మునసబు అప్పుడే వీధినుంచి వస్తుంటే తాత అరచాడు. "ఆ వెధవనుంచే వూర్లో వుండలేకపోతున్నామా, ఇక యీ కుంట వెధవ తయారయ్యాడు. వెధవల్ని వూరినుంచి తగిలేస్తేనేగానీ తలెత్తుక తిరగలేమురా?"

ఎదురుగా నిల్చున్న సాయన్నని జరిగిన సంగతేమిటని అడిగాడు. అంతావిని వెధవ యింటికిరానీ కాళ్ళు విరగగొత్తే మళ్ళీ ఆపని చెయ్యలేదని మునసబు హామీ యివ్వగానే సాయన్న వెళిపోయాడు.

అక్కడే నిల్చున్న బాబురావు తెలుసుకున్న విషయమది
అవూరికి తూర్పుదిక్కున శివాలయంవుంది. ఆ ఆలయం యెదురుగా ఒక పెద్ద మామిడితోట, తోటచుట్టూ యెత్తైన ముళ్ళడొంకలున్నాయ్. ఆ వూర్లో దొంగసారా అమ్ముతున్న సాయన్న మట్టికూజాతో ప్రొద్దుగ్రుంకే వేళకు సారా తెచ్చి ఆ తోటలో ఒక సీతా అక్షింతాల పొదక్రింద గొయ్యిత్రవ్వి దాచాడు. సీతయ్య పెద్దకొడుకు యెలాచూశాడో యేమో వెళ్ళి కూజా బయటకు తీశాడు. దూరంనుంచి చూస్తున్న సాయన్న మాసిన కాకికోటు వేసుకొన్నవాడినిచూసి యే సాల్టుజమానో అనుకొని భయపడి చెట్టుచాటున దాగుండిపోయాడు. కూజా పట్టుకొని ఆలయం వేపు పరుగెత్తుతుండగా పోల్చివెంటతరిమాడు. చేతిలో కూజా జారి బ్రద్దలై సారా అంతా నేలపాలైంది. కుర్రాడు దౌడుతీసి మాయమైపోయాడు.

ఆలయం దగ్గరగానే వున్న పాకలో సాధును సాక్షిగా వేశాడు సాయన్న. ఊరంతా గౌరవించే ఆసాధు, కుర్రవాని దొంగతనాన్ని నిరశించి మునసబుగారితో వెళ్ళి చెప్పరా అని మరీ పంపించాడు.

ఈ లాభంలో భాగస్వామియైన మునసబు వేపు చూసి జాలి పడ్డాడు బాబురావు. పెరటివేపు సీతయ్య తాత యిల్లువుంది. ఇంకా ఆ పెరటకు చింతచెట్టు—ఆ చెట్టు దగ్గరగానే పాడునుయ్యి వుంది. గగ్గోలు వినిపించటంవల్ల బాబూరావు పెరటకు వెళ్ళాడు.

సీతయ్య తాత వాకిట వుగ్రనరసింహరూపం దాల్చి వున్నాడు పులి మేకమీదకు వురికినట్లు కొడుకుమీదకు వురికి ఒళ్ళంతా పచ్చడి చేస్తున్నాడు. కుర్రాడి చింకి వదులు మిలటరీ కాకీకోటు భుజాలు బాగా చిరిగిపోయాయ్. "అమ్మో! బాబో! చచ్చానర్రో—రండర్రో అమ్మో—అమ్మో!" ఒకటే గోల—ఒకటే అరుపు—ఆ గోలతో రెట్టింపు దెబ్బలు పడుతున్నాయ్. సీతయ్య తాత పళ్ళు బిగబట్టి "చచ్చిపోరా యెధవా" అని హుంకరించాడు. నేలకొరిగి వాడిని కాళ్ళతో కూడా తన్నటం మొదలు పెట్టాడు. ఇప్పుడు గడపదాటి వాకిటకు వచ్చి పెళ్ళాం అడ్డుపడింది. పెళ్ళాన్ని ప్రక్కకు నెట్టి మళ్ళీ గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు, పెద్దవాళ్ళు కూడా భరించలేని శిక్ష అది. అడ్డుకోడానికి శక్తిలేని భార్య నోరుజేసుకుంది. "నివ్వా దొంగవే—నిన్నెవడు కొడ్తాడు?"

ఒకనాడు, తాత అన్న మాటలు యీ నాటికి దొంగైనా ఆచరణలో పెట్టడం చూసి అలా దూరంగా నిల్చొనే స్తంభించిపోయాడు బాబురావు. తల్లి తప్పించి మిగతా వాళ్ళంతా మరి నాలుగు చాడీలు చెప్తున్నారే గాని అడ్డుపడలేదు.

ఈ సారి అడ్డుపడ్డ భార్య జెబ్బమీద కొట్టాడు. జెబ్బ పట్టుకొని అడ్డగా నిల్చొనే అనరాని మాటలుకూడా అంటోంది. బాబురావు దగ్గరగా వెళ్ళి తాత చెయ్యి పట్టుకొని పెరటకు త్రోసుక వెళ్ళాడు. వెనుకకు రాబోతూనే అరుస్తున్నాడు "నివ్వండు నాయనా! యెముకలు విరిచేస్తేనే గానీ మళ్ళీ దొంగతనానికి వెళ్లడు!"

లేవనెత్తినా లేవలేని పరిస్థితిలో కొడుకు వున్నాడు. తల్లి జోగుతోంది. ఐనా తల్లికి కొడుకుని మోసుకొని వాకిల్లోకి తీసుకపోయే శక్తి వచ్చింది.

బాబురావు తాతను పెరటకు త్రోసుకపోయాడు. చింత చెట్టు క్రింద యిద్దరూ యెదురెదురుగా నిల్చున్నారు. చింతగిర్రుగిమంటోంది. చల్లనిగాలి వీస్తోంది. బాబురావు చెట్టుకు ఒక చేతిని ఆన్చి నిల్చొని "తాతా! అవ్వయేమందో వినుపించుకున్నావురా!"

పశుబలమంతా కక్కి వేసిన తర్వాత పొందిననిస్త్రాణ నీటిని పూరించింది. జబాబురాలేదు. నడుముకుకట్టిన చింకి మాసిన గుడ్డ విప్పి కళ్ళు ఒత్తుకుంటూ కొంచం బెక్కుతూ ఆగి అన్నాడు "అంటారు నాయనా !నా... దినాలు—బాగోలేనప్పుడు—ఎవరైనా అంటారు—నేను దొంగనే. వూరంతా అన్నప్పుడు—మీ అవ్వ యెందుకు మిగలాలి?"

కమ్ముకొస్తున్న చీకటికి యెంత భీకరమైనదో యీ శోకమూ అంతే. నోటిముందు గుడ్డ అడ్డుపెట్టుకొని శోకాన్ని విజృంభించనివ్వకండా తగ్గించి మనుమని వేపు గ్రుడ్లుపైకి తేల్చి చూసి గొణిగాడు " దొంగనని పేరు పడిపోయాను నాయనా! పిల్లలు కొన వూపిరితో వుంటే యేం చెయ్యమంటావ్ ? చంపేమంటావా? నీతో

చెప్పకేం ? ఇప్పటికి నాలుగుసార్లే దొంగతనం చేశానురా నాలుగు సార్లు దొరికిపోయానురా !”

వణికిస్తున్న చలికి గుడ్డ కప్పుకున్నాడు. అంతకంటే దారుణమైనది హృదయంలోవున్నా లేనట్లు తాత మెసలుతుండటం చూచి బాబూరావు విస్తుపోయాడు. తాత యీసారి మరీ దగ్గరగా వచ్చి గొణిగాడు “మాయిద్దరం వస్తుండి పిల్లలకు ముందు చూస్తున్నామా ? ఆ గాడిదకి యీ పాడుబుద్ధి యెందుకు పుట్టాలి ? ఆ సాధు పావలాయిస్తాను కూడా తెచ్చీమంటే యీ యెధవ తెచ్చీడమే !”

“ఆసాధుని పోయి తన్నలేక పోయావూ ?

“ఉష్ ! యెవరిలో చెప్పకు. ఆలాంటి వాళ్ళని యేమీ చేయకూడదు పాపం !”

బాబురావుకు నవ్వాలో యేడవాలో యేమీ తోచలేదు. చిన్నతాత అన్నాడు “పురుగూబుట్రా వుంటుంది నడు నాయనా! నడూస్తూనే “నాయనా వెళిపోతావురా ! మళ్ళీ యెప్పుడో యేంటో ? ఆ పట్నం వెళిపోయినా యీదొంగతాతని మరచిపోకేం !”

బాబురావు కళ్ళయెదుట మళ్ళీ స్టేషను—చీకటి—నల్లని కోటుతో సన్నని మనిషి స్టేషను మాస్టరు దొంగలు గురించి చెప్పటం—అప్పుడు భీకరంగా అగపడిన దొంగలు బహుశ యిలాంటి దొంగలే అన్న ఆలోచనతో యింటివేపు నడిచాడు.

(1952 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక)